క్లుప్తంగా

పార్టీ బీమా డబ్బులు మంజూరు చేయాలి

● కేటీఆర్‌కు విన్నవించిన బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలు ఇరువురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని వారి కుటుంబాలకు బీమా డబ్బులు మంజూరు చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రూరల్ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్ కలిసి విన్నవించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను జగన్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిచ్‌పల్లి మండలం నడిపల్లి తండాకు చెందిన బట్టు సతీశ్‌కుమార్, రూరల్ మండలం తాళ్ల కొత్తపేట తండాకు చెందిన మెగావత్ శత్రు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినట్లు కేటీఆర్‌కు వివరించారు. దీంతో మృతుల కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయన్నారు. ఇరు కుటుంబాలకు పార్టీ నుంచి వచ్చే ఇన్సూరెన్స్ డబ్బులను మంజూరు చేయాలని కేటీఆర్‌ను కోరారు. దీనిపై కేటీఆర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే డబ్బులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు జగన్ తెలిపారు.

బీఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షుడికి పరామర్శ



నిజామాబాద్ రూరల్: అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావును రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు బానోత్ గోపాల్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, అక్బర్ నవజొద్దీన్, జమీర్ ఖాన్, గులాబ్ సింగ్, ఇందల్ నాయక్, కాలూర్ రాజేందర్ తదితరులు ఉన్నారు.

అభ్యాసలో జిలాస్థాయి చెస్ పోటీలు



నిజామాబాద్ నాగారం: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న అభ్యాస స్కూల్‌లో ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ సభ్యుడు నరేంద్రకుమార్ షా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన మోహన్ సాప, శివచరణ్, బి.అభిజిత్, బ్రహ్మానందం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హర్దీప్‌సింగ్, డాక్టర్ స్వామాట్ యాదవ్, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు రమేశ్, గుగ్లోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాల, మాల ఉపకులాలకు న్యాయం చేయాలి



నిజామాబాద్ నాగారం: ఎస్సీ వర్గీకరణతో మాల, మాల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని వెంటనే రోస్టర్ విధానంలో మార్పులు తేవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చొక్కం దేవిదాస్ అన్నారు. ఆలూరు జనహిత పాదయాత్రలో పాల్గొన్న ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు నాటరాజు,జిల్లా ఉపాధ్యక్షులు తొడ్డు లక్ష్మణ్,చంద్రకాంత్,సంయుక్త కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు మోహన్, ఆలూరు మండలాధ్యక్షుడు అగ్గు క్రాంతి, నాయకులు మల్లారం రమేశ్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. తాళ్ల రామడుగు గ్రామంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగారెడ్డి, దుడ్డు గంగాధర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్
- బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు



యోగా కేంద్రం నిర్వాహకులు, సాధకులతో ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: యోగా సాధనతోనే ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందవచ్చని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం వినాయక్‌నగర్‌లోని శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఆరోగ్య యోగా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే యోగాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని అన్నారు. తనువు, మనస్సు, శరీరాన్ని ఏకం చేసి నిర్వహించే యోగాసనాలతో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగాకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఇలాంటి కేంద్రాల స్థాపనతో ప్రజలకు ఆరోగ్యపరంగా మేలు జరుగుతుందన్నారు.యోగాను ప్రతిఒక్కరూ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పంచరెడ్డి లావణ్య, లింగం, యోగా గురువులు రంజిత్, బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, మఠం పవన్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేత



రఫీకి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు భాస్కర్, స్వామి



పడకల్‌లో..

డిచ్‌పల్లి: వారంతా పొట్టకూటి కోసం గల్ఫ్ లోని దుబాయ్ దేశానికి వలస కార్మికులుగా వెళ్లారు. అక్కడి కంపెనీలో పని చేసే సమయంలో స్నేహితులుగా మారారు. ఇప్పుడు వారిలో ఒకరు అనారోగ్యానికి గురికాగా మిగిలిన వారు అతడిని ఆదుకునేందుకు రూ. పదివేల వేల ఆర్థికసాయం అందజేశారు. వివరాలిలా.. నవీపేట్ మండలం సిరన్‌పల్లికి చెందిన మహమ్మద్ రఫీ గతంలో దుబాయ్‌లోని థర్మో కంపెనీకి ఎలక్ట్రీషియన్ పనిచేయడానికి వెళ్లాడు. అక్కడ అతడితో పాటు పని చేసే వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురు స్నేహితులుగా మారారు. అనంతరం వారంతా స్వగ్రామాలకు వచ్చేశారు. రఫీ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా రఫీ మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఇటీవల అతడి పరిస్థితి మరింత దిగజారింది. వారంలో రెండుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. రఫీకి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. దీంతో కొంత డబ్బులను జమచేశారు. వారిలో డిచ్‌పల్లికి చెందిన చక్రాల భాస్కర్, మెంట్రాజ్‌పల్లికి చెందిన స్వామి ఇద్దరూ ఆదివారం సిరన్‌పల్లికి వెళ్లి రూ. పది వేలు రఫీకి అందజేశారు. ఎవరైనా దాతలు స్పందించి రఫీని ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కూర శ్రీజ పదిలో మండల టాపర్‌గా నిలువడంతో మాజీ సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేందర్ రెడ్డి, వీడీసీ సభ్యులు రాజేశ్వర్ గౌడ్, శివన్న, పవన్, పీడీ శ్రీనివాస్, ప్రణీత్, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్ నాగారం: గోవాలో ఈ నెల 7న నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభ గోడప్రతులను పీసీసీ చీఫ్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున బీసీలు సభకు తరలనుండడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం ఇవ్వాలనుకున్న రిజర్వేషన్లను కేంద్రం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, చంద్రకాంత్, శ్రీలత, బగ్గలి అజయ్, బసవసాయి, సదానంద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనహిత పాదయాత్రలో నగర కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్ సిటీ: ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్రలో నగర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆలూరులో నిర్వహించిన పాదయాత్రలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, ఆకుల మహేందర్, ఇర్ఫాన్ అలీ తదితరులు ఉన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



అమరవీరుల పార్కులో కేక్‌కట్‌చేస్తున్న స్థానిక మిత్రబృందం



రావూజీ సంఘం పాఠశాలలో..

నిజామాబాద్‌నాగారం/ నిజామాబాద్ రూరల్: స్నేహితుల దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. చిన్న నాటి స్నేహితులు, చదివిన మిత్రులందరూ అమరవీరుల పార్కు, పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేశారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను మిత్రులకు అందజేశారు.

కులాస్‌పూర్ తండాలో ఘనంగా తీజ్



మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ తండాలో ఆదివారం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. యువతులు తొమ్మిది రోజులపాటు గోధుమబుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్ బాలు నాయక్, తండా పెద్దలు శీను నాయక్, బలరాం నాయక్, బిలియా నాయక్, రావుసింగ్ నాయక్, మాజీ ఎంపీపీ లతా కన్నీరాం, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, తండావాసులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ గాలికి..





వినాయక్‌నగర్‌లోని 100 ఫీట్ల రోడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్ 100 ఫీట్ల రోడ్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను సంబంధిత అధికారులు గాలికొదిలేశారు. తరచూ మరమ్మతులు, నిర్వహణ పేరుతో విద్యుత్ అంతరాయాలను ప్రకటిస్తున్న అధికారులకు.. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు కన్పించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈదురుగాలులు, వర్షాలు కురిసే సమయంలో బ్రేక్ డౌన్ అయితేనే స్పందిస్తున్నారని, మిగతా సమయాల్లో వాటి నిర్వహణపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి.. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణకు చొరవ చూపాలని కోరుతున్నారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

- నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నుడా చైర్మన్ కేశ వేణు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిజామాబాద్ సిటీ: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ మున్నూరుకాపు సంఘంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన నుడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న సమయంలో పేదల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రానికి చెందిన పలు విభాగాల వైద్యులు స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, నరాల సమస్యలు, దంత పరీక్షలు, మహిళల సమస్యలు, పిల్లల వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీచేశారు. శిబిరాన్ని నిర్వహించిన రామర్తి గోపిని పలువురు ప్రముఖులు ఆకుల పాపయ్య, పంచరెడ్డి సుదర్శన్ అభినందించారు. కార్యక్రమంలో నాయకులు విఘ్నేశ్ యాదవ్, వేణురాజ్, ప్రజలు పాల్గొన్నారు.

వికలాంగ, చేయూత పింఛన్లు పెంచి ఇవ్వాలి



మోపాల్‌లో మాట్లాడుతున్న రొడ్డ ప్రవీణ్

మోపాల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు, ఇతర పెన్షన్ దారులకు పెన్షన్ పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రొడ్డ ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మోపాల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు అవుతున్నా పింఛన్లను పెంచి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 13న వికలాంగులు, చేయూత పింఛన్‌దారుల మహాగర్జన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ జయప్రదం కోసం ఈ నెల 5న ఆర్మూర్ పట్టణంలోని ఎంఆర్ గార్డెన్‌లో సన్నాహక సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభకు అన్ని మండలాల ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఇతర అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బీరప్ప, సలీమ్, పెద్దోళ్ల యమున, పిడుగు మహేశ్, గుండారం అశోక్, ఎర్రోళ్ల గోపి, దమ్మడి విక్కీ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో ప్రజల్లో అసంతృప్తి

- అధికారుల అలసత్వం, గుత్తేదారుల నిర్లక్ష్యం
- సకాలంలో పూర్తికాని వంతెనలు, రోడ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ఇందల్వాయి: ప్రజల సౌకర్యార్థం రోడ్లు, వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. కోట్ల నిధులు మంజూరు చేసినా అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారుల అలసత్వంతో సదరు పనులు పూర్తి కావడం లేదు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అసంపూర్తి రోడ్లపై ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇందల్వాయి మండల కేంద్రం నుంచి ధర్పల్లి, సిరికొండ మండలాలకు వెళ్లే రోడ్డు మార్గాలపై ఇంకా పనులు కొనసాగుతున్నాయి.

వంతెన పూర్తయినా..



ధర్పల్లి మండలం వాడి గ్రామం వద్ద రూ. తొమ్మిది కోట్ల నిధులతో చేపట్టిన హై లెవెల్ వంతెన పూర్తయినా రోడ్డు ఇరువైపుల చేపట్టిన పనులు పూర్తి కాలేదు. దీంతో వాహనదారులు గతుకుల రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వంతెనకు ఇరువైపుల రోడ్డు పూర్తయితే ప్రయాణం సాఫీగా సాగుతుందని వాహనదారులు, చుట్టు పక్కల గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లర్ల వద్దే నిలిచిన గడ్కోల్ వంతెన పనులు



సిరికొండ మండలం గడ్కోల్ వద్ద రూ.12 కోట్ల నిధులతో చేపట్టిన వంతెన పనులు పిల్లర్ల వద్దే నిలిచిపోయాయి. ఈ మార్గం గుండా ప్రయాణించే రైతులు వేరే మార్గం లేక డబ్బులు పోగేసి తాత్కాలికంగా మట్టి రోడ్డు వేసుకొని వాగులో ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. నిధులు లేక గుత్తేదారు పనులు నిలిపివేశారు. ఈ విషయం తెలిసిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఇందల్వాయి రైల్వే గేటు వద్ద ఉన్న రోడ్డు దుస్థితి. గేటుకు ఇరువైపుల గుంతలతో కూడిన రోడ్డు ఏళ్ల తరబడి పూర్తిస్థాయి మరమ్మతులకు నోచుకోక ప్రయాణికులకు తీవ్ర అసహనం కలిగిస్తోంది. గేటు పడిన ప్రతీసారి వందల వాహనాలు నిలిచి గేటు తీయగానే గుంతలను దాటేసరికి పావుగంట పడుతుందని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు చొరవ తీసుకొని తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



అటవీ శాఖ అనుమతులు లేక..



ఇందల్వాయి-ధర్పల్లి రోడ్డు మార్గానికి గతంలో మరమ్మతులు చేపట్టారు. అన్సాన్‌పల్లి శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో మాత్రం అటవీశాఖ నుంచి అనుమతులు లేకపోవడంతో అక్కడ రోడ్డు మరమ్మతులు నిలిచిపోయాయి. అక్కడ జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు చనిపోగా మరికొందరు క్షతగాత్రులయ్యారు. ప్రమాద తీవ్రత తెలిసినా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు అటవీ శాఖ అనుమతులు పొందడంలో విఫలమవుతున్నారు. ఇంకా రోడ్డు అలాగే ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పూర్తికాని లింగాపూర్ బ్రిడ్జి పనులు

లింగాపూర్ వద్ద రూ. ఏడు కోట్ల నిధులతో చేపట్టిన హై లెవెల్ వంతెన పనులు ఇంకా పూర్తి కాలేదు. వర్షాలకు వాగు పారుతుండటంతో రోడ్డు మూసివేశారు. దీంతో ధర్పల్లి, సిరికొండ వైపు వెళ్లే వాహనదారులు దారి తెలియని మారుమూల గ్రామాల నుంచి తిరిగి వెళ్లాల్సి వస్తోంది. సమయం, ఇంధన వృథా అవుతోందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారు వంతెనకు ఇరువైపులా అరకొరా మట్టివేశారు. ఇది ప్రమాదకరమని తెలిసినా ద్విచక్రవాహనాలు, కార్లు వెళ్లడానికి అనుమతిస్తున్నారు.



ప్రమాదకరంగా ఉన్న వంతెన

రోడ్డు ఎక్కాలంటేనే..



ఇందల్వాయి మండల కేంద్రం నుంచి ధర్పల్లి, ఒన్నాజిపేట్, గడ్కోల్ ప్రాంతాలకు వెళ్లాలంటే భయమేస్తుంది. వంతెనలు, రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి.

– చిలుకూరి బాల్‌రెడ్డి, గడ్కోల్

చర్యలు చేపడుతున్నాం

లింగాపూర్ వంతెన వద్ద విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్తవి వేసే పనులు, రోడ్డుకు ఇరువైపుల మట్టి వేసే పనులు సాగుతున్నాయి. అటవీ శాఖ అనుమతులు రాగానే అన్సాన్‌పల్లి వద్ద అసంపూర్తిగా మిగిలిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తాం. పనుల జాప్యంపై ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరగా వంతెన, రోడ్డు పనులు పూర్తి చేస్తాం.

– గంగాధర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఇందల్వాయి

నూతన కార్యవర్గం ఎన్నిక



పల్నాటి రఘు, అధ్యక్షుడు

నిజామాబాద్ నాగారం: నగరంలోని దుబ్బలో పద్మశాలి సంఘం తర్ప-27 నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్నాటి రఘు, ప్రధాన కార్యదర్శిగా యేముల రాజేశ్వర్, కోశాధికారిగా శ్రీపతి నరేశ్, గౌరవ అధ్యక్షుడిగా నక్క కృష్ణ, ఉపాధ్యక్షుడిగా గడ్డం నర్సింలు, సహాయ కార్యదర్శిగా ఉడుత శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తుందని సంఘ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గం..

నిజామాబాద్‌అర్బన్: పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అధ్యక్షుడిగా కనకపురం రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుచ్చన్న, రాష్ట్ర అసోసియేటర్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

13న విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికలు

నిజామాబాద్ నాగారం: నగరంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికలను ఈ 13న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి పి.ఆశయ్య, సహాయ ఎన్నికల అధికారి పి.భూమాగౌడ్ ఆదివారం తెలిపారు. పాత తాలుకా నిజామాబాద్ పరిధిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఓటును వినియోగించుకోవాలని కోరారు.